కథ

# నాన్న గుర్తొస్తున్నాడు

**ఎం. వెంకటేశ్వరరావు**

**ఎ.పి.ఎక్స్‌ప్రెస్ ఎ/సి టూ టైర్లో లోయర్ బెర్తులో కూచుని నాగపూర్‌లో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పేపర్సు తిరగేస్తున్నాను. ఏకాగ్రత కుదరడం లేదు. పేపర్సు పక్కన పడేసి, ఇంటికి ఫోన్ చేద్దామని సెల్ తీశాను. 'నో సిగ్నల్' అనొస్తోంది. దాన్ని పక్కన పెట్టి, విండో కర్టెన్ పక్కకి జరిపి చూశాను. రైలు ఏ స్టేషన్ దాటిందో స్పష్టంగా తెలియటం లేదు గానీ, సికింద్రాబాద్ స్టేషనొదిలి రెండున్నర గంటలయింది. న్యూస్ పేపర్ తీశాను. హెడ్‌లైన్స్ తప్ప మరేదీ బుర్రకెక్కడం లేదు. ఎందుకో నాన్న పదే పదే గుర్తొస్తున్నాడు. తప్పు చేశానేమో!**

''ఆవేశంలో తీసుకునే నిర్ణయాలెప్పుడూ సరైనవి కావని నాన్న చెప్తూండే వాడు'' ఇప్పుడా మాటలు నా చెవిలో పదే పదే మార్మోగుతున్నట్టనిపిస్తోంది. నాన్న విషయంలో నేను తీసుకున్న నిర్ణయం ఆ క్షణాన నాకు సరైనదిగానే అనిపించింది. అయినా నాన్న నాకెదురుగా కూచున్నట్టనిపిస్తోంది.

★ ★ ★

నాన్నని కష్టపడి పైకొచ్చిన వ్యక్తిగా అందరూ అంటుండే వాళ్ళు. అసలా మాటంటేనే..నాకు నచ్చదు. భూమ్మీద ప్రాణమున్న ప్రతి ప్రాణీ కష్టపడ్తూనే ఉంటుంది.

ఆరుగురు పిల్లలున్న ఇంట్లో ఆఖరివాడు నాన్న. ఆ ఇంట్లో నాన్నొక్కడే బి.ఏ. వరకూ చదువుకుని, బ్యాంకు ఉద్యోగంలో చేరిన వ్యక్తి. అదే ఆయన ఎవరెస్ట్ శిఖరం ఎక్కినట్టు భావించేవాడు.

నాన్నకి తెల్సిన లోకం ఇల్లు, బ్యాంకు. నేనలా కాదు. నూతిలో కప్పలాంటి నాన్న కడుపున పుట్టినా నేను తెలివిగలవాణ్ణి. అందుకే...నాన్న ఎవరి ముందైనా ''మా విశ్వం అచ్చు నా పోలికే. నాలాగే వీడు..'' అని చెప్తుంటే, విన్లేక అక్కణ్ణుంచి వెళ్ళిపోయేవాణ్ణి. చూపులకి ఇద్దరికీ పోలికలున్నంత మాత్రాన నాన్న నన్ను తనతో పోల్చుకోవడాన్ని సహించలేకపోయేవాణ్ణి. ఎందుకంటే...ఏ చదువూ లేని తన అన్నయ్యలు ఆస్తంతా కరిగిస్తుంటే...చదువుకుని బ్యాంకులో అందరి చేతా లెఖ్ఖల్లో 'ఘటికుడని' అన్పించుకోవటమే తప్ప, తన జీవితపు లెఖ్ఖ తప్పుతుంటే, పట్టించుకోకుండా, పిల్లల్ని చదివించటమే ఘనకార్యంగా భావిస్తూ బ్రతుకుతున్న నాన్నలా ఉండకూడదని ఊహ తెల్సినప్పట్నుంచీ ఆలోచిస్తూ...అందరికంటే విభిన్నంగా ఉండాలనుకునేవాణ్ణి.

పక్కింటాయన పేరడిగితే తడుముకునే నాన్న, పదేళ్ళనాటి లెక్కల్ని నిద్రలో లేపి అడిగినా కరెక్టుగా చెప్పేవాడు. మనిషి ఖచ్చితం, మాట ఖచ్చితం. దుప్పటి ఉన్నంత వరకే కాళ్ళు ముడుచుకోవాలనుకునే మనస్తత్వం. ఎవరికీ అప్పిచ్చేవాడు గాదు, ఎవర్నీ అప్పడిగే వాడు కాదు.

అక్కడే నాన్న అభిప్రాయాలకీ, నా అభిప్రాయాలకీ యుద్ధం జరిగేది. మన దగ్గర ఇవ్వాళ డబ్బులేదని, ఇవ్వాల్టి ఆనందం రేపు రమ్మంటే వస్తుందా? అని వాదించేవాడిని. మా వాగ్వాదంతో అమ్మ నన్ను సపోర్టు చేసినా, నేనాయన అధీనంలో ఉన్నంతవరకూ నా ఊహలు, ఆనందాలు మొగ్గలో ముడుచుకున్న రేకుల్లానే మిగిలిపోయాయి. కుటుంబం కష్టాల ముందు మా ఇష్టాలు ఎగిరిపోయేవి.

మొత్తానికి ఎం.బి.ఎ కంప్లీట్ చేసి, ఓ ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాను.

నా కలుపుగోలుతనం, మాట నేర్పరితనంతో ఎదుటి వాళ్ళెంతటి వాళ్ళైనా మాటల్తో బోల్తా కొట్టించి, తప్పు జరిగినా దాన్ని క్షణంలో ఒప్పుగా మార్చి, తడుముకోకుండా, అబద్ధాల్ని సబద్ధాలు చెయ్యగల నేర్పు నా సొంతం. నాకింద పన్జేసే వాళ్ళ దగ్గర్నుంచి, పై అధికార్ల వరకూ గుర్తింపు పొందగల్గానంటే కేవలం నా వాక్పటిమే కారణం. తద్వారా నేను అతనికాలంలోనే ప్రమోషన్ల మీద ప్రమోషన్లందుకుని ప్రస్తుతం జోనల్ మేనేజరు స్థాయిలో ఉన్నాను. నా గురించి ఇలా చెప్పుకోవడానికి అవమానంగానో...సిగ్గుగానో నాకన్పించదు. ఇదే నేటి కాలంలో నాకు తెల్సిన న్యాయం.

నాన్న మీద నాకు ద్వేషమే లేదు. రిటైరయ్యాకైనా నాన్న పడ్డ కష్టాలకి ఫుల్‌స్టాప్ పెట్టాలనీ, అద్దె ఇళ్ళ బాధ నుండి బయట పడాలని, ఇటీవలే హైదరాబాదులో నేను కొత్తగా కట్టుకున్న ఇంట్లో, అమ్మా నాన్నల కోసం సెపరేట్ గది, వసతులు ఏర్పరచాను.

నా స్పీడు ఆలోచనలకీ, గిరిగీసుకు బ్రతికిన నాన్న భావాలకీ పొంతనే కుదర్లేదు. అమ్మ అడ్జస్టయినా నాన్న ఇమడలేకపోయాడు.

నాలుగో తరగతి చదువుకున్న నా కొడుకు హరీష్‌కి నెలకి ఐదొందలు కట్టి లెఖ్ఖల ట్యూషన్‌కి పంపటం దగ్గర మొదలైన స్పర్థ, పెద్దదై..ఖర్చు విషయాల్లో నాన్న కల్పించుకుని సలహాలివ్వబోతుంటే..భార్యని వెనకేసు కొచ్చి, ఎన్నో ఏళ్ళుగా నాన్నమీద నాలో పేరుకుపోయిన అసహనం ఆవేశంగా మారి, ''ఇక్కడ అడ్జస్ట్ అవ్వగల్గితేనే ఉండండి, లేకపోతే వెళ్ళిపోండి'' అని నోరు జారేసరికి, స్వాభిమానం దెబ్బతిన్న నాన్న ఆరోజు సాయంత్రమే అమ్మని తీసుకుని ఊరెళ్ళిపోయాడు.

★ ★ ★

ఈ సంఘటన జరిగి వారం రోజులవుతున్నా, ఈ విషయం గురించి..మళ్ళీ ఇప్పటివరకూ ఆలోచించే సమయమే దొరకలేదు. ఎంత ఆలోచించినా, ''ఇమడ లేనప్పుడు ఆమడ దూరంలో ఉండడమే మంచిదనెళ్ళిన నాన్న నిర్ణయానికే నేను ఓటేశాను''

రైలు వేగానికి, ఎ.సి.చల్లదనానికి, మనసులో భారానికి కళ్ళు మూతలు పడ్డాయి.

★ ★ ★

''సార్! మీరు నాగపూర్‌లో దిగాలిగదా!'' నిద్రబోతున్న నన్ను లేపి టి.టి. అడిగేసరికి..

గబగబా లేచి కూచుని పేపర్లన్నీ బ్రీఫ్‌కేస్‌లో సర్దిదిగేశాను.

తల భారంగా, నెప్పిగా ఉండటంతో వేడి వేడి టీ తాగుదామని వెళ్ళాను.

టీ తాగుతూ, రిసీవింగ్ కమిటీ పర్సన్‌కి ఫోన్ చేద్దామని, సెల్‌ఫోన్ కోసం జేబులో చెయ్యి పెట్టాను. ఫోను లేదు. ఆ ఆలోచన రాగానే తాగుతున్న వేడి టీ నాలుకని చురుక్కుమన్పించింది. నేనొచ్చిన రైలుందేమోనని కళ్ళు ప్లాట్‌ఫారం వైపు చూసి, నిరాశగా వెనుతిరిగాయి.

టీ కప్పు కింద పెట్టి ప్యాంటు జేబులు వెతికాను. ''ఊ..హూ..'' బ్రీఫ్ కేస్ తెరిచి చూశాను. కన్పించలేదు. ఒక్కక్షణం మైండంతా బ్లాంకయింది.

గబగబా లేచి ప్లాట్‌ఫారం మీదున్న ఎస్టీడీ బూత్‌కెళ్ళి, నా సెల్ ఫోన్‌కి రింగ్ చేశాను. నాట్ రీచబుల్




అనొస్తోంది. రైల్లోనే మర్చిపోయుంటాను. ఎలా?

రెండ్రోజుల కాన్ఫరెన్స్ కోసం నాగపూర్ వచ్చే కొలీగ్స్‌వి డెలిగేట్స్‌వి, కల్సుకోవాల్సిన కస్టమర్ల నంబర్లన్నీ, సెల్‌ఫోన్లోనే స్టోర్ చేసున్నాయి.

ప్లాట్‌ఫారం మీది కొచ్చాను. రద్దీ తగ్గి ఖాళీగా ఉంది.

స్టేషన్ బయటికొచ్చి, మళ్ళీ ఎస్టీడి బూత్‌కెళ్ళి, నాకంటే ముందే నాగపూర్ వచ్చిన నా సబార్డినేట్‌కి ఫోన్ చేద్దామని డయల్ చెయ్యబోతుంటే నంబర్ గుర్తు రావట్లేదు. అందరి ఫోన్ నంబర్లూ సెల్‌లోనే స్టోర్ చేసున్నాయి. నంబర్ గుర్తు చేసుకుంటూ హైదరాబాదు హెడ్డాఫీస్‌కి ఫోన్ చేయగా ''రాంగ్ నంబర్'' అనొస్తుంటే పిచ్చి పట్టినట్టయింది.

నంబర్లు అటూ ఇటూ మార్చి చేసినా ఫలితం శూన్యం. 'మెదడు చేసే పనిని, యంత్రానికి అప్పజెప్పి, దానికి బానిసవ్వటం అంటే ఇదేనేమో!' అన్పించింది.

ఇంటి నంబరుకి ఫోన్ చేశాను.

నా భార్య సుగుణ ఫోనెత్తి, ''అబ్బా! ఏమిటండీ! ఎక్కడున్నారు? గంటనుండి మీ మొబైల్‌కి ట్రై చేస్తున్నాను. లిఫ్ట్ చెయ్యరేం?''

''నేను నాగపూర్లోనే ఉన్నాను. రైల్లో నా ఫోన్ మిస్సయింది. విషయం ఏంటో చెప్పు''

''మీ నాన్న గుండెనొప్పితో పోయారట. ఫోనొచ్చింది. మీరు వెంటనే బయల్దేరి వచ్చెయ్యండి. నేను పిల్లల్ని తీసుకుని ఇప్పుడే బయల్దేరుతున్నాను''

ఆ మాట వింటూనే ఒళ్ళంతా చల్లబడ్డట్టయింది. నాన్న బాగానే తిరుగుతున్నాడే, సడన్‌గా ఎందుకిలా జరిగింది. చిన్నప్పట్నుంచీ నాన్నంటే నాకు పెద్దగా ఆత్మీయత లేకపోయినా ''ఆయన ఇక లేడు'' అనే ఆలోచన..ఇన్నేళ్ళ నా మేకపోతు గాంభీర్యాన్ని నిర్వీర్యం చేసినట్టన్పించింది.

''ఏంటండీ! మాట్లాడరు. ఏ బస్సో, రైలో పట్టుకుని తిన్నగా ఊరికి వచ్చి చేరండి. శవాన్ని సాగనంపాలిగా!'' అని ఫోన్ పెట్టేసింది.

సుగుణ అన్న చివరిమాట ముల్లులా గుండెల్లో గుచ్చుకున్నట్లన్పించింది. నా తల్లిదండ్రుల గురించి నేనెప్పుడైనా ఆమెతో గొప్పగా చెప్తేగదా! ఆమె వాళ్ళని గౌరవించడానికి.

ఎస్టీడీ బూత్ నుండి బయటికొచ్చి, తర్వాత ఏం చేయాలా! అనే ఆలోచనతోనే ఐదు నిముషాలు గడిచాయి.

పర్సు తీసి చూశాను రెండొందలున్నాయి.

అప్పుడు గుర్తొచ్చాయి...సుగుణ మాటలు. ఉదయం బయల్దేరుతుంటే..''మీ పర్సులో ఉన్న రెండు వేలు నేను తీసుకున్నాను. మీరు వెళ్ళేటప్పుడు ఎ.టి.ఎం.లో తీసుకోండి'' అన్జెప్పింది.

బయల్దేరే హడావిడిలో, మనీ డ్రా చేసే సమయం లేక నాగపూర్‌లో తీసుకోవచ్చనుకుని రైలెక్కాను.

ఎ.టి.ఎం.లో డబ్బు డ్రా చేసి, నాగపూర్లో కాన్ఫరెన్స్ జరగబోయే ఆడిటోరియం కెళ్ళి, వాళ్ళతో కాన్ఫరెన్స్‌కి రాలేని పరిస్థితి వివరించి, వెంటనే బయల్దేరదామనుకుని, ఎ.టి.ఎం. వెతుక్కుంటూ వెళ్ళాను.

ఎ.టి.ఎం. మెషీన్‌లో కార్డు ఇన్సర్ట్ చేశాక పిన్ నంబరు గుర్తుకు రావటం లేదు. నాలుగంకెల నంబరు రెండుతో మొదలవుతుంది. అది కూడా సెల్‌లోనే స్టోర్ చేశాను.

అసలే టెన్షన్‌గా ఉన్న నాకు ఎంత ఆలోచించినా పిన్ నంబరు కన్‌ఫ్యూజింగ్‌గానే వుంది. ''ఎంటర్ కరెక్టు పిన్ నంబర్'' అనొస్తోంది.

చివరి ప్రయత్నంగా మరోసారి ప్రయత్నించగా...

''యువర్ కార్డ్ హేజ్ బీన్ రీటెయిన్డ్. కాంటాక్ట్ యువర్ బ్రాంచ్'' అనే స్లిప్పు బయటికి పంపి, నా ఎ.టి.ఎం. కార్డ్‌ని తనలో దాచుకుంది మెషీన్. వళ్ళంతా చెమటలు పట్టాయి.

కాళ్ళీడ్చుకుంటూ బయటికొచ్చి మెట్ల మీద కూలబడ్డాను. మనసంతా నిస్సత్తువ ఆక్రమించుకుంది.

నాన్న గుర్తొచ్చాడు. తన మెదడులో ఎన్నో సంవత్సరాల బ్యాంకు లెక్కలతోబాటు, తెల్సిన వాళ్ళ ఫోన్ నంబర్లు, సన్నిహితుల బర్త్‌డేలు, మేరేజ్ డేలే గాక, టెన్త్ క్లాస్ నుండి ఎం.బి.ఏ వరకూ నేను ఏ సబ్జెక్టుల్లో ఎన్ని మార్కులు స్కోరు చేసిందీ తడుముకోకుండా కరెక్ట్‌గా చెప్పే నాన్న... నా వైపు నవ్వుతూ చూస్తూ..నవ్వుతూ నడిచి వెళ్తున్నట్టన్పించింది.

నా సమర్థత ఏమిటో నాకు తెలిసొచ్చింది. భోరున ఏడ్వాలన్పించింది. అయినా నా కళ్ళ వెనుక ఇంకిపోయిన కన్నీళ్ళు బయటికి రాకుండా ''నువ్వెంతేడ్చినా బయటికి రాలేమంటూ'' ఆగిపోయాయి.